సేంద్రియ సాగుపై ఆసక్తి

- సహజ ఎరువులపై రైతుల మొగ్గు
- ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్
- 5 వేల ఎకరాల్లో విస్తీరణం



శింగరాజుపాలెంలో వాణిజ్య పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నల్లజర్ల: రసాయనాలు, క్రిమిసంహారకాలు మితిమీరి వినియోగించడంతో వ్యవసాయం పూర్తిగా కాలుష్యం బారినపడింది. ఎరువులతో పర్యావరణానికి ముప్పుతో పాటు, వాటితో పండించే ఆహార ఉత్పత్తులు తిని ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినే పరిస్థితులు ఎదురవుతున్నాయి. భూమితో పాటు గాలి, నీరు క్రమేణా కలుషితమవుతున్నాయి. ప్రకృతితో అనుసంధానమై వ్యవసాయం చేస్తేనే ఈ పరిస్థితుల నుంచి బయటపడగలం. ఈ నేపథ్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయం ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ సాగు విధానంలో రసాయన ఎరవులు, పురుగుమందుల వాడకం తగ్గించడంతో, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, పర్యావరణానికి మేలు చేస్తుందని రైతులు తెలిపారు. ఎందుకంటే ఇది సుస్థిర వ్యవసాయానికి, పర్యావరణానికి మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుంది.

నియోజకవర్గంలో సాగు ఇలా..

గోపాలపురం నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 5 వేల ఎకరాలలో 6,500 మంది రైతులు ఈ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రారంభించారు. కూరగాయల సాగుతో పాటు, ఆకుకూరలు వరి, ఆయిల్ ఫామ్, నిమ్మ, మొక్కజొన్న, ఖోఖో, బొప్పాయ వంటి అంతర పంటల సాగు జరుగుతోంది. ఈ ఏడాది వర్షీనియాలో కూడ ఈ విధానాన్ని ప్రారంభించారు. నల్లజర్ల మండలంలో శింగరాజుపాలెం, మార్లెమ్మూడి, ముసుళ్లగుంట, పుల్లలపాడు, నల్లజర్ల గ్రామాల్లో ఈ ఏడాది ఈ తరహా వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. వరి, కూరగాయల సాగు, ఆయిల్‌ఫామ్, నిమ్మ, బొప్పాయి, మొక్కజొన్నలలో ప్రయోగాత్మకంగా 400 మంది రైతులు 200 ఎకరాలలో సాగును ప్రారంభించారు. ఒక మాస్టర్ ట్రైనీని నియమించారు. ఇలా జిల్లాలో అన్ని మండలాలల్లో సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్య వంతుల్ని చేస్తున్నారు.



పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు, ఆవు మూత్రంతో ఎరువును తయారు చేస్తున్న మహిళ

క్షేత్ర స్థాయిలో అవగాహన

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్దగా నష్టం ఉండదంటున్నారు. ప్రకృతి పరంగా సాగయ్యే పంటకు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి ఉంటుందని, చీడపీడలు ఎక్కడా దరి చేరవు. నాణ్యమైన ఉత్పత్తుల వలన చక్కని ఆరోగ్యం మన సొంతమవుతుంది. పండించే పంటలకు మంచి డిమాండ్ ఉంటుంది. బీజామృతం, జీవామృతం, బ్రహ్మాస్త్రం, ఆచ్ఛాదన తదితర ప్రకృతి సాగుకు సంబంధించిన అంశాలపై, కషాయాలు తయారీపై చైతన్యవంతుల్ని చేస్తున్నామని తెలిపారు.



ఎరువుల పిచికారీపై కూలీలకు అవగాహన

భూమి ఉత్పాదకత మెరుగు

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించేందుకు అవసరమైన సూచనలు చేయడంతో పాటు వాటిని స్వయంగా పర్యవేక్షించి వాటి ఫలితాలు రైతులకు చూపుతున్నామన్నారు. వరినాట్లకు వరుసగా మూడేళ్ల పాటు నవధాన్యాలు వేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. పొలాల్లో సహజ పద్ధతిలో పంటలను పండించడానికి ఆవుపేడ, ఆవు మూత్రం, బెల్లం ,వేపాకు, సీతాఫలం ఆకు తదితర వాటితో కషాయాలు తయారు చేసి సాగులో వినియోగించేలా చేస్తున్నామన్నారు. తద్వారా సారం కోల్పోయిన భూమి తిరిగి మూడేళ్లలో సారవంతమవుతందన్నారు. భూమి స్థితి మారి దిగుబడులు పెరుగుతాయన్నారు.

రైతుల ఆసక్తి ..



ప్రకృతి వ్యవసాయ విధానం అవలంభించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. సహజంగా పండించిన పంటలకు మార్కెట్లో మంచి ధరలు వస్తున్నాయి. మొక్కలు ఏపుగా పెరిగి మంచిదిగుబడి ఇస్తాయి. వానపాములు, సూక్ష్మజీవులు పంటలకు మేలు చేస్తాయి.

శ్రీనివాసరావు, మాస్టర్‌ట్రైనర్.ప్రకృతి వ్యవసాయం విభాగం,నల్లజర్ల.

ఖర్చులు తగ్గాయి



రూ.10వేలు ఖర్చు చేసి రసాయనిక ఎరవులు కొని చేసే వ్యవసాయంలో వెయ్యి రుపాయిలతో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం ద్వారా ఆరోగ్యం బాగుంటుంది.

చల్లా నాగమణి, మహిళా రైతు.సింగరాజుపాలెం

క్లుప్తంగా

కోట సత్తెమ్మ క్షేత్రంలో భక్తుల కోలాహలం



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మవారు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,11,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలి



రాజంపాలెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న మానవతా సభ్యులు

గోపాలపురం: మొక్కల పెంపకాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలని మండల మానవత ఛైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. మండలంలోని రాజంపాలెం గెడ బాస్కరరావు అందజేసిన సుమారు 400 మామిడి మొక్కలను మానవత ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటటంతో పాటు వాటి పోషణకూడా చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మండల మానవత ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు గెడ జోగేంద్రప్రసాద్, నెల్లి చంద్రశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.


వెలగని వీధిలైట్లు

దేవరపల్లి: మండల కేంద్రం దేవరపల్లి అంధకారంలో చిక్కుకుంది. దాదాపు 20 రోజుల నుంచి గ్రామంలో వీధిలైట్లు వెలగని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క భారీ వర్షాలు కురుస్తుండడంతో రోడ్లు జలమయం అవుతుండటంతో, చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని, విషసర్పాలు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. పాలకులు, అధికారులకు ప్రజల సమస్యలు పట్టవా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల ఇబ్బందులను గమనించి వీధి లైట్లు వెలిగించాలని కోరుతున్నారు.

మహిళ మృతి

చాగల్లు: కలుపుమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిక్కాల గ్రామానికి చెందిన మాసిబోయిన పోశమ్మ (37) ఆదివారం మృతిచెందింది. చాగల్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం..శనివారం ఉదయం ఆమె ఇద్దరు కుమార్తెలు మందలించడంతో క్షణికావేశంలో కలుపుమందు తాగింది.ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఈమేరకు పోశమ్మ భర్త మాసిబోయిన శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్సై కె.నరేంద్ర కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదభరితంగా కల్వర్టులు



మల్లవరంలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

చాగల్లు: ఆర్అండ్‌బీ రహదారుల్లో కల్వర్టులు శిధిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్దా కాలం కావడంతో కూలే స్థితిలో దర్శనమిస్తున్నాయి. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మేరకు చాగల్లు మండలంలోని దారవరం-కొవ్వూరు రహదారిలో మల్లవరం వద్ద ఉన్న కల్వర్టు శిధిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉంది. బీటలు వారి కూలిపోయే స్థితిలో ఉన్న ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు నిత్యం అనేక వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో కల్వర్టుకు రైలింగ్ లేకపోవడంతో రోడ్డు ఇరుకుగా ఉండి తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



రాజ్‌కుమార్ దంపతులకు చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: దూబచర్ల గాంధీకాలనీకి చెందిన గంటా వికలాంగుడు రాజ్‌కుమార్ కూతురు నిత్యశ్రీ కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. ఈ మేరకు స్థానిక జడ్పీ హైస్కూల్లో దాదాపు 30 సంవత్సరాల క్రితం రాజ్‌కుమార్‌తో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఎప్పటికప్పుడు తోటి స్నేహితుల యోగక్షేమాలు అడిగి తెల్సుకుంటునే ఉన్నారు. ఈ నేపథ్యంలో స్నేహితుడు రాజ్‌కుమార్ కూతురు సమస్యను తెలుసుకుని వాట్సాప్ గ్రూపు ద్వారా దాదాపు రూ.1.25లక్షలు సేకరించారు. ఆదివారం స్థానిక ఉన్న పూర్వ విద్యార్థులు లక్ష రుపాయిల చెక్కును బాధిత దంపతులకు అందజేశారు. ఖర్చులకు కొంతసొమ్మును, నిత్యావసరాలను అందించామన్నారు. ఆపదలో ఉన్న స్నేహితుడికి ఆర్థిక సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నిడదవోలు: పట్టణానికి చెందిన యాదవ్ సామాజిక వర్గానికి చెందిన గాలి మురళి అనారోగ్యంతో బాధపడుతుడడంతో నిడదవోలు పట్టణ గోకులకృష్ణ సంక్షేమ యాదవ్ సంఘం సభ్యులు స్పందించి రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసరాలను ఆదివారం అందజేశారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు గంగుల గోపియాదవ్, కార్యదర్శి గుడ్ల సతీష్, కోశాధికారి తీర్థాల ఆంజనేయులు, సభ్యులు తోటా ఉమాశంకర్, గంగుల నాగరాజు, బాలాజీ , ప్రేమ్‌సాయి, గోపి, పండు తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు..



దేవరపల్లిలో కుండపోతగా కురుస్తున్న వర్షం



సమిశ్రగూడెంలో జోరుగా కురుస్తున్న వర్షం

- కుండపోతగా కురుస్తున్న వర్షాలు
- ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

దేవరపల్లి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నాలుగు రోజులుగా ముసురు వీడలేదు. ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు పలు ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా తయారైయ్యాయి. పలు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు 128.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైయింది. అత్యధికంగా రాజానగరం మండలంలో 48.6 మిల్లీ మీటర్లు నమోదు కాగా, అత్యల్పంగా రంగంపేట మండలంలో 1.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతవరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల దృష్ట్యా రైతులు ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. రసాయనిక ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో చల్లారదన్నారు. ముఖ్యంగా యూరియా లాంటి ఎరువు వాడినట్లయితే వర్షాలకు పొలంలో చల్లిన యూరియా కొట్టుకుపోతుంది. ప్రస్తుత పరిస్థితిలో నీటిని అవకాశమున్న చోట్ల డ్రైనేజీ ద్వారా బయటకు పోయే ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.



మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఎడతెరిపి లేని వర్షం

నిడదవోలు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నిడదవోలు మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్లు ప్రాంతాలు జలమయమయ్యాయి. సమిశ్రగూడెం, తాడిమళ్ల, కోరుమామిడితో పాటు పలు గ్రామాల్లో విస్తరంగా వర్షం పడటంతో రహదారులపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించి, పలు గ్రామల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

జర్నలిస్టుల కృషి అభినందనీయం

గోపాలపురం: సమాజానికి ఉపయోగపడే వార్తలు అందజేస్తూ నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న వర్కింగ్ జర్నలిస్టుల కృషి అభినందనీయమని దేవరపల్లి సీఐ కె.నాగేశ్వర్ నాయక్ అన్నారు. గోపాలపురంలో ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా ఆదివారం నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మానుకొండ చలపతిరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ నాయక్ మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందిస్తూ ఎప్పటికప్పుడు తాజా వార్తలు ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న నేటి జర్నలిస్టుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, దేవరపల్లి, గోపాలపురం ఎస్సైలు వి.సుబ్రహ్మణ్యం, పి మనోహర్, ట్రైనీ ఎస్సై జి.గణేష్, డాక్టర్ కె. చైతన్య పాల్గొన్నారు.



మానుకొండ చలపతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ నాయక్, జర్నలిస్టులు

సత్తాచాటిన నిడదవోలు విద్యార్థి



విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎంఈఓ గురుమూర్తి

నిడదవోలు: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్‌లైన్‌లో 'యువజనులకు మీరిచ్చే సందేశం' అనే అంశంపై నిర్వహించిన గ్లోబల్ పోస్టకార్డు రైటింగ్ కాంటెస్ట్-2025 పోటీల్లో నిడదవోలుకు చెందిన 8వ తరగతి విద్యార్థి కుంచాల తపస్వీరెడ్డి ప్రతిభ చాటాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉడాన్ యూత్ క్లబ్ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో 26 దేశాలకు చెందిన వేలాదిమంది పాల్గొనగా ఏపీకి చెందిన తపస్వీరెడ్డి పంపిన సందేశం ఎంపికకావడం అభినందనీయమని ఆదివారం ఎంఈఓ పి.గురుమూర్తి కొనియాడారు. అనంతరం సంబంధింత ప్రశంసా పత్రాన్ని విద్యార్థికి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ



గోపాలపురం స్టేషన్ వద్ద గుమిగూడిన ఇరువర్గాల యువకులు

గోపాలపురం: మండల కేంద్రంలో రెండువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవరకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆదివారం రాత్రి గోపాలపురం బీసీ కాలనీకి చెందిన యువకులు, ఉప్పరగూడెం గ్రామానికి చెందిన యువకులు పరస్పరం గొవడలు పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఒకరినోకరు కొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పరగూడెం వర్గానికి చెందిన సుమారు 200 మంది యువకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్ దేవరపల్లి, గోపాలపురం ఎస్సైలు సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకుని ఇరువర్గాలను చెదరకొట్టారు. అనంతరం కొవ్వూరు డీఎస్పీ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

మానవతామూర్తుల చేయూత



దేవరపల్లి మండలం సేవా సంస్థకు దాత అందజేసిన శాంతి రథం

- రూ.32 లక్షల వ్యయంతో శాంతి రథం ఏర్పాటు
- శ్మశాన వాటికకు మృతదేహాల తరలింపు

దేవరపల్లి: చనిపోయిన మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి స్మశాన వాటికలు,కైలాస భూములు సుదీర్ఘ దూరాన ఉండడంతో అక్కడకు తీసుకు వెళ్లేందుకు మండలంలోని ప్రజలు నానావస్థలు పడవలసిన దుస్థితి ఎదురవుతోంది. మృతదేహాలకు అంతిమ సంస్కరాలు నిర్వహించడానికి నలుగురు రక్తసంబంధీకులు తోడు దొరకని నేటి రోజుల్లో మేమున్నాం అధైర్యపడవద్దు అంటు ముందుకు వస్తోంది మానవత స్వచ్ఛంద సేవా సంస్థ. అంత్యక్రియల క్రతువును సైతం వ్యాపారంగా మార్చేసిన నేటి ప్రైవేటు వ్యవస్థకు ధీటుగా నిస్వార్థ సేవా భావంతో, దాతల సహకారంతో గ్రామాల్లో శాంతి (కైలాస) రథాలను అందుబాటులోకి తీసుకువచ్చింది.



విరాళాలు సేకరిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

రూ.32 లక్షలతో రథం ఏర్పాటు

దుద్దుకరుకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త కరుటూరి ధనుంజయ్ తన తండ్రి మాజీ సర్పంచ్ సూర్యారావు జ్ఞాపకారం శాంతి రథం ఏర్పాటుకు ముందుకు వచ్చారు. సుమారు రూ.7 లక్షల వ్యయంతో శాంతి రథాన్ని కొనుగోలు చేసి సంస్థ ప్రతినిధులకు అందజేశారు. సుమారు రూ. 25 లక్షలు విరాళాలు సేకరించి బ్యాంకులో డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో రథం నిర్వహణ, డ్రైవర్ జీతం ఇవ్వడానికి లక్ష్యంగా సంస్థకు చెందిన సభ్యులు పనిచేస్తున్నారు. ఇప్పటికే దీని నిమిత్తం సుమారు 20 మంది దాతల నుంచి దాదాపు రూ.10 లక్షలు విరాళం సేకరించారు. మరొక రూ. 15 లక్షల విరాళం సేకరించవలసి ఉందని సభ్యులు తెలిపారు.

సేవలు ఉచితం

మృతదేహాలను ఇంటి వద్ద నుంచి కైలాస భూమికి తీసుకు వెళ్లడానికి శాంతి రథాన్ని ఉచితంగా సమకూరుస్తారు. 10 కిలో మీటర్ల లోపు వరకు ఉచితంగా కాగా, ఆ పరిధి దాటితే ఇంధనం ఖర్చును వసూలు చేస్తారు. నిరుపేదల కుటుంబాలకు ఇంధనం ఖర్చు కూడా సంస్థ సమకూరుస్తుందని సభ్యులు తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు దాతల సహకారం మరువలేనిది. అనాథ మృతదేహాల అంత్యక్రియలకు ఈ రథం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. దాతలు సహకరంతో మరొక రూ.15 లక్షల విరాళాలు సేకరిస్తున్నాం. శాంతి రథం అవసరమైన వారు సంస్థ ప్రతినిధులను సంప్రదించాలి.

బండి సూర్యప్రకాశరావు, మండల మానవత సంస్థ అధ్యక్షుడు, దేవరపల్లి.